APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 09, జూలై 2026 సంపుటి: 01 సంచిక :43 పేజీలు : 04 వెల: 2-00/-



## ప్రంబనాన్ శివాలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు

- ఇండోనేషియా అధ్యక్షుడితో కలిసి దర్శనం
- ఆలయ పునరుద్ధరణకు భారత్ సహకారం
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

జకార్తా, జులై 8 : ఇండోనేషియా పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రపంచ ప్రఖ్యాత ప్రంబనాన్ హిందూ దేవాలయ సముదాయాన్ని సందర్శించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో కలిసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి "ఓం నమః శివాయ" నామస్మరణలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఈ ఆధ్యాత్మిక క్షణాలకు సంబంధించిన దృశ్యాలను ప్రధాని సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఆలయ సందర్శనకు ముందు ప్రధానమంత్రి మోదీ, అధ్యక్షుడు ప్రబోవో సంయుక్తంగా ప్రంబనాన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ చారిత్రక ఆలయ పరిరక్షణ, పునరుద్ధరణ పనులకు భారత్ ఆర్థిక, సాంకేతిక సహకారం అందించనుంది. ఇందుకు సంబంధించి ఇరు దేశాల మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రంబనాన్ ఆలయానికి వెళ్లే మార్గంలో స్థానిక ప్రజలు భారత, ఇండోనేషియా జాతీయ జెండాలను చేతబట్టి ఘన స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయాల పట్ల అక్కడి ప్రజలు చూపిన ఆదరణను ప్రధాని మోదీ అభినందించారు. ఆలయ సముదాయంలోని చారిత్రక నిర్మాణాలను పరిశీలిస్తూ వాటి ప్రత్యేకతలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## సంక్షేమ విద్యార్థులకు డైట్ ఛార్జీలు 10 శాతం పెంపు



- రెండో త్రైమాసికం నుంచే పెంపు అమలు చేయాలని సీఎం ఆదేశం
- హాస్టళ్లు, గురుకులాల నిర్వహణకు రూ.100 కోట్ల కేటాయింపు
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దాలని సూచన

అమరావతి, జులై 8: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర బడుగు బలహీన వర్గాల విద్యార్థుల డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంచిన డైట్ ఛార్జీలను అమలు చేయాలని అధికారులకు సూచించారు. సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సౌకర్యాలతో కొత్త గురుకులాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణ కోసం రూ. 100 కోట్ల మెయింటెనెన్స్ గ్రాంట్ కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వసతి, నాణ్యమైన భోజనం, అవసరమైన మౌలిక సదు-పాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు జీవనోపాధి అవకాశాలను కూడా విస్తరించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మెప్మా, డ్వాక్రా, పీ4 వంటి కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు వ్యవసాయం, ఉద్యానవనం, పాడి పరిశ్రమ తదితర రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆదాయం పెరిగేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన పంటలు, రబ్బర్, కాఫీ, పసుపు సాగును ప్రోత్సహించి రైతులకు లాభదాయక అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే కల్లుగీత కార్మికులు, వడ్డెరలు, నాయీబ్రాహ్మణులు, మత్స్యకారులు, చేనేత కార్మికులు తదితర వర్గాలకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని మరింత విస్తరించాలని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ అమలు చేస్తున్న విధానాలను ఇతర కార్పొరేషన్లలోనూ అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.



## పోలవరానికి లక్ష క్యూసెక్కుల వరద

- భారీ వర్షాలతో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- పోలవరం ప్రాజెక్టు 48 గేట్లు ఎత్తివేసిన అధికారులు
- వరద ఉధృతికి కాజ్‌వే దెబ్బతిని రాకపోకలు నిలిపివేత

ఏలూరు, జులై 8: తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉపనదులు పొంగిపొర్లుతూ ప్రధాన నదిలో కలుస్తుండటంతో వరద ప్రవాహం రోజు-రోజుకూ పెరుగుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది.

## ఉయ్యూరులో నూతన తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం



- ప్రజలకు వేగవంతమైన, పారదర్శక రెవెన్యూ సేవలే లక్ష్యం
- ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించిన మంత్రి
- రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక రెవెన్యూ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబాటు

ఉయ్యూరు, జులై 8 : రాష్ట్ర ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవె-న్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని ఉయ్యూరులో నూతనంగా నిర్మించిన అత్యాధునిక తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, జిల్లా కలెక్టర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఒకేచోట అన్ని రెవెన్యూ సేవలు సులభంగా అందేలా ఆధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపా-యాలను కల్పిస్తున్నామని చెప్పారు .రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా కొత్త తహశీల్దార్ కార్యాలయాలను నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా భూములకు సంబంధించిన సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పరిపాలనా సేవలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. పారదర్శకత, జవాబుదారీతనంతో సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ నూతన తహశీల్దార్ కార్యాలయంతో ఉయ్యూరు ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్రజలకు అవసరమైన సేవలు త్వరితగతిన అందేలా అధికారులు సమ-ర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ప్రజలకు నాణ్యమైన పరిపాలనా సేవలు అందించడంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.



## యూట్యూబర్ రావణ్ అరెస్టుపై ప్రభుత్వంపై కొడాలి నాని విమర్శలు

- ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని ఆరోపణ
- అరెస్టులో కక్షపూరిత వైఖరి అవలంబించారని విమర్శ
- తప్పుడు ప్రచారంతో వైసీపీని లక్ష్యంగా చేసుకుంటున్నారని వ్యాఖ్యలు

అమరావతి, జులై 8: యూట్యూబర్ రావణ్ అరెస్టు వ్యవహారంపై మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కొడాలి నాని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, విమర్శించినా కొత్త చట్టాల పేరుతో కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రావణ్‌పై తీవ్ర నిబంధనలు ప్రయోగించి అరెస్టు చేయడం రాజకీయ కక్షసాధింపులో భాగమేనని కొడాలి నాని ఆరోపించారు. ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిని లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకుంటున్నారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అధికార పార్టీ నాయకులు, అనుకూల మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. తమ పార్టీని వివిధ పేర్లతో విమర్శిస్తున్నారని, అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు. రావణ్ చేసిన వ్యాఖ్యలు కొత్తవి కావని, గతంలో పలువురు రాజకీయ నాయకులు కూడా ఇలాంటి విమర్శలు చేశారని కొడాలి నాని పేర్కొన్నారు. గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా తమపై విమర్శలు వచ్చినా ఇలాంటి చర్యలకు పాల్పడలేదని అన్నారు. కోర్టులు బెయిల్ మంజూరు చేసిన తర్వాత కూడా కఠిన చట్టాలు ప్రయోగించడం సరికాదని అభిప్రాయపడ్డారు. రావణ్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిగా చిత్రీకరించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని కొడాలి నాని ఆరోపించారు. తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

అనంత సూర్య తెలుగువార్త

గురువారం 09 జూలై 2026

# మహానేతకు 'అనంత' జోహార్లు

- అనంతపురంలో వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు
- వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల సేవా కార్యక్రమాలు
- వైఎస్ అంటే ఓ నమ్మకం.. ఓ ధైర్యం
- రాయలసీమకు కృష్ణా జలాలు వైఎస్ఆర్ చలవే
- ఉమ్మడి అనంతకు వైఎస్ఆర్ చేసిన మేలు మరువలేం
- జగన్ నాయకత్వంలో వైఎస్ ఆశయాలు కొనసాగిస్తాం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ



అనంతపురం, జూలై 08 అనంత సూర్య : మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను అనంతపురంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు చేపట్టాయి. ముందుగా నగరంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్ఆర్ విగ్రహానికి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైసీపీ ఇంటెలెక్చువల్ విభాగం నాయకుడు కట్టుబడి తానీషా రూపొందించిన 'జననేత' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని గైనిక్ వార్డులో గర్భిణులు, బాలింతలకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. అనంతపురం రూరల్ మండలంలోని తపోవనం సర్కిల్‌లో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అదేవిధంగా వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి ఆధ్వర్యంలో రంగస్వామినగర్‌లో ఉన్న స్పందన ఫౌండేషన్‌లో బుద్ధిమాంద్య పిల్లలకు అన్నదానం నిర్వహించారు.

**భౌతికంగా లేకున్నా ప్రజల గుండెల్లో పదిలం**

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 1996లో తాను ఎంపీగా ఉన్న సమయంలో వైఎస్ఆర్ కూడా ఎంపీగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా అభివృద్ధి విషయంలో విలువైన సూచనలు చేసేవారన్నారు. 2004లో సీఎం అయ్యాక అనంతపురం జిల్లా అభివృద్ధి పట్ల ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిదని చెప్పారు. కరువుకు నిలయంగా ఉన్న రాయలసీమకు నేడు కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది వైఎస్ఆర్ చలవేనని అన్నారు. జలయజ్ఞం ద్వారా ఉమ్మడి ఏపీలో అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. తాడిపత్రి నియోజకవర్గంలో నార్త్ కెనాల్ స్థిరీకరణ, పెండేకల్లు, చాగల్లు, యాడికి కెనాల్ వైఎస్ ఘనతేనని తెలిపారు. అనంతపురంలో ఆర్ట్స్ కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేశారని, జేఎన్‌టీయూ--ఎకు స్వయంప్రతిపత్తి తెచ్చిన ఘనత వైఎస్ఆర్‌దని తెలిపారు. అత్యంత వెనుకబడిన మడకశిరలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నెలకొల్పారని అన్నారు. అదేవిధంగా అనంతపురం నగరానికి తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ధర్మవరం, కదిరి, రాయదుర్గం, గుంతకల్లులో తాగునీటి పథకాలు అందించిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిదని తెలిపారు. శ్రీరామిరెడ్డి పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం ప్రాంతాలకు తాగునీరు అందించారని తెలిపారు. రాజకీయాలు, కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్‌కే దక్కుతుందని చెప్పారు. తండ్రి అడుగుజాడల్లోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణం కొనసాగుతోందని.. ఐదేళ్ల పాలన ప్రజారంజకంగా సాగిందని తెలిపారు. వైఎస్ జగన్ నాయకత్వంలో వైఎస్ఆర్ ఆశయాల సాధన కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

**దేశానికే రోల్‌మోడల్‌గా సంక్షేమ పథకాలు**

పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో సీఎం అయ్యాక పేదల పక్షపాతిగా పరిపాలన సాగించారని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్ అంటే ఒక నమ్మకం.. ఒక భరోసా అని అన్నారు. పేదల పిల్లలు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని గుర్తు చేశారు. పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత రాజశేఖరరెడ్డికే దక్కుతుందని తెలిపారు. పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు.

## 48వ డివిజన్ వాటర్ ట్యాంక్ వద్ద పైప్ లీకేజీ మరమ్మత్తులు

**డివిజన్ వాసులకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకున్న క్లస్టర్ ఇంచార్జ్ మోహన్**



అనంతపురం: 48వ డివిజన్ పరిధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ప్రధాన నీటి పైప్ లైన్ లీకేజీ కావడంతో స్థానికంగా నీరు వృధాగా రోడ్డుపై పారుతూ ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న వెంటనే 48వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. డివిజన్ వాసులకు తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు వెంటనే జెసిబి సహాయంతో తవ్వకాలు చేపట్టి లీకేజీ ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. ఏ ఎం సి సిబ్బంది పర్యవేక్షణలో పైప్ లైన్ మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్డుపై నీరు నిలవకుండా, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మాట్లాడుతూ, "ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరమ్మత్తులు పూర్తి చేస్తాం. ఎక్కడైనా నీటి లీకేజీ, ఇతర సమస్యలు ఉంటే వెంటనే డివిజన్ కార్యాలయానికి తెలియజేయాలి" అని అన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు ఆదేశాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తాం అని డివిజన్ ఇంచార్జ్ మోహన్ అన్నారు . ఇదిలా ఉండగా మునుపెన్నడు ఇలా సమస్య వచ్చిన వెంటనే నాయకులు స్పందించేవారు కాదని మోహన్ వచ్చిన తర్వాత ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారం అవుతున్నాయని స్థానికులు చర్చించుకోవడం గమనార్హం

## విద్యార్థులకు చిక్కీలను వెంటనే సరఫరా చేయాలి



- పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర డిమాండ్
- డీఈవో కార్యాలయ ఏడీకి వినతిపత్రం అందజేత

కొత్తచెరువు, జూలై 08, అనంత సూర్య; ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహార కార్యక్రమంలో భాగంగా అందించాల్సిన చిక్కీలు విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులైనా సరఫరా కాకపోవడం తీవ్ర ఆందోళనకరమని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, నాయకులు సాయినాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కొత్తచెరువులోని డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్ మోహన్‌ను కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న 508 ప్రభుత్వ పాఠశాలలకు చిక్కీల సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన 'చండీఘర్ సీడ్స్ లిమిటెడ్' సంస్థపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, సదరు సంస్థ టెండర్‌ను రద్దు చేయాలన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ సంస్థ ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు చిక్కీలను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించి వెంటనే చిక్కీలను సరఫరా చేయని పక్షంలో, విద్యార్థుల ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మొండి నందకిషోర్, సంఘం నాయకులు భరత్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తచెరువులో మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



కొత్తచెరువు, జూలై 08, అనంత సూర్య: కొత్తచెరువు మండల కేంద్రంలోని బుక్కపట్నం రోడ్డులో బుధవారం ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. ఓ మతిస్థిమితం లేని వ్యక్తి అక్కడి వాల్మీకి విగ్రహం గోపురంపైకి ఎక్కి తీవ్ర కలకలం సృష్టించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధరాంపురం గ్రామానికి చెందిన సాయి (అలియాస్ తిక్క సాయి) అనే వ్యక్తి బుధవారం అకస్మాత్తుగా వాల్మీకి విగ్రహ గోపురంపైకి చేరుకున్నాడు. పైకి ఎక్కిన అతను అక్కడ హల్‌చల్ చేస్తూ కింద ఉన్న జనాన్ని ఆందోళనకు గురిచేశాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికుల సహకారంతో సదరు వ్యక్తిని సురక్షితంగా కిందికి దించేందుకు చర్యలు చేపట్టారు. సాయికి మతిస్థిమితం సరిగా లేదని, గతంలోనూ అతను ఇలాగే ప్రవర్తించి ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యాడని స్థానికులు ఈ సందర్భంగా మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనతో బుక్కపట్నం రోడ్డు పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

## కొత్తచెరువు మార్కెట్ యార్డ్‌లో ఆన్‌లైన్ ద్వారా మార్కెట్ ఫీజు చెల్లింపులు ప్రారంభం

- అవకతవకలకు తావులేకుండా పారదర్శక నిర్ణయం
- మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ వెల్లడి



కొత్తచెరువు, జూలై 08, అనంత సూర్య: పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మార్కెట్ యార్డ్ నందు నిర్వహించే గొర్రెల సంతలో సరికొత్త సంస్కరణకు శ్రీకారం చుట్టారు. మార్కెట్ యార్డ్‌లో జరిగే లావాదేవీలు, మార్కెట్ ఫీజు వసూళ్లను ఈరోజు నుండి పూర్తిగా ఆన్‌లైన్ (డిజిటల్) పద్ధతి ద్వారా ప్రారంభించినట్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ తెలిపారు. బుధవారం జరిగిన గొర్రెల సంతలో ఆయన ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పూల శివప్రసాద్ మాట్లాడుతూ... ప్రతి బుధవారం కొత్తచెరువు గొర్రెల సంతకు వచ్చే రైతులు, వ్యాపారస్తులు ఇకపై తమ మార్కెట్ ఫీజులను ఆన్‌లైన్ పేమెంట్ ద్వారానే చెల్లించాలని కోరారు. డిజిటల్ చెల్లింపుల విధానం ద్వారా మార్కెట్ ఫీజుల లావాదేవీలలో ఎలాంటి అవకతవకలు జరగడానికి అవకాశం ఉండదు. అంతా పారదర్శకంగా సాగుతుంది. రైతులు, వ్యాపారస్తులు ఈ నూతన విధానానికి సహకరించాలి. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రటరీ ఈశ్వర్ ప్రసాద్, మార్కెట్ యార్డ్ సిబ్బంది, స్థానిక వ్యాపారస్తులు, రైతులు, పాల్గొన్నారు.

## బీజేపీ ఏపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా జయరాములు



కదిరి, జూలై 8 అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గానికి చెందిన దోరణాల జయరాములు భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ రాష్ట్ర కమిటీ నియామకాలను ప్రకటించారు. ఈ సందర్భంగా జయరాములు మాట్లాడుతూ, సాధారణ కార్యకర్తను గుర్తించి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించడం బీజేపీ ప్రత్యేకత అని అన్నారు. గతంలో పార్టీ అప్పగించిన వివిధ బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నియామకానికి సహకరించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు జయరాములు ధన్యవాదాలు తెలిపారు.

## పదవీ విరమణ చేసిన హోంగార్డుకు రూ.4.92 లక్షల ఆర్థిక సాయం

**చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ పి. జగదీష్**



అనంతపురం, జూలై 8 అనంత సూర్య:జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా సేవలందించి పదవీ విరమణ పొందిన పి. విశ్వనాథ్‌కు తోటి హోంగార్డులు సేకరించిన రూ.4,92,740 ఆర్థిక సహాయాన్ని జిల్లా ఎస్పీ పి. జగదీష్ బుధవారం చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు ఎంతో విలువైనవని, విధి నిర్వహణతో పాటు పదవీ విరమణ చేసిన సహోద్యోగికి అందరూ కలిసి ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సహాయం పి. విశ్వనాథ్ కుటుంబానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. హోంగార్డుల మధ్య ఉన్న ఐక్యత, సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ జాఫర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**• నల్లమాడలో పోలీసుల అవగాహన సదస్సు, ర్యాలీ**

నల్లమాడ, జూలై 8 అనంత సూర్య: మహిళల రక్షణకు అమలులో ఉన్న చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నల్లమాడ సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం నల్లమాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు, ర్యాలీ



నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, పోక్సో చట్టం, మహిళల రక్షణకు ఉన్న వివిధ చట్టాలు, ఫిర్యాదు చేసే విధానం, చట్టపరమైన సహాయం పొందే మార్గాలపై వివరించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి బీసీ హాస్టల్ వరకు అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థినులకు లైంగిక వేధింపులు లేదా దాడులు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కేజీబీవీ ఎస్ఓ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ.7.5 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

**చెక్కు అందజేసిన మంత్రి పయ్యావుల కేశవ్**

అనంతపురం, జూలై 8 అనంత సూర్య: ఉరవకొండకు చెందిన ఆరు నెలల చిన్నారి కుమ్మరి లోకేష్ అరుదైన ప్రైమరీ హీమోఫాగోసైటిక్ లింఫో హిస్టియోసిస్ వ్యాధితో బాధపడుతుండగా, అతని చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ. 7.50 లక్షల



ఆర్థిక సహాయం మంజూరైంది. కొద్దిరోజుల క్రితం చిన్నారి తల్లిదండ్రులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ను కలిసి ఆర్థిక సహాయం కోరగా, వెంటనే స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం అనంతపురంలోని తన నివాసంలో చిన్నారి తల్లి కుమ్మరి లతకు రూ. 7.50 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి చికిత్సకు ప్రభుత్వం అందించిన సహాయానికి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి పయ్యావుల కేశవ్కు కృతజ్ఞతలు తెలిపారు.

## శేషాపురం భక్తులకు అయోధ్య దివ్య పుణ్యయాత్ర

అయోధ్య, జూలై 8 అనంత సూర్య: శేషాపురం గ్రామానికి చెందిన భక్తులు



పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. తెలుగుదేశం యువనేత బీవీ అరుణ్ కుమార్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జయనగర్ జిల్లా ఉపాధ్యక్షురాలు చిన్నపరెడ్డి పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్రలో భక్తులు ముందుగా ప్రయాగ్‌రాజ్లోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించి, అనంతరం అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిరంలో బాలరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ



భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఈ పుణ్యయాత్ర ద్వారా లభించిందన్నారు. చిన్నపరెడ్డి పద్మావతి రెడ్డి మాట్లాడుతూ త్రివేణి సంగమం నుంచి అయోధ్య బాలరాముడి దర్శనం వరకు ప్రతి ఘట్టం భక్తుల జీవితాల్లో చిరస్మరణీయంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ పుణ్యయాత్రలో పాల్గొన్న భక్తులు దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ, యాత్రను జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభవంగా అభివర్ణించారు.

## బహిరంగంగా మద్యం సేవించిన ఏడుగురికి రూ.7 వేల జరిమానా

పుట్టపర్తి, జూలై 8 అనంత సూర్య: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు అసౌకర్యం కలిగించిన ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున మొత్తం రూ. 7,000 జరిమానా విధించినట్లు పుట్టపర్తి



అర్బన్ సీఐ యువరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ క్రమంలో పట్టుబడిన ఏడుగురిని పుట్టపర్తి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరచగా, వారు తప్పును అంగీకరించడంతో న్యాయస్థానం జరిమానా విధించింది. మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## తాటిచెర్ల చెరువులో నల్లమట్టి తవ్వకాలు



**రోజుకు 50 లోడ్లు తరలింపు..**

**అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు**

*అనంతపురం, జులై 8 అనంత సూర్య :*

తాటిచెర్ల గ్రామంలోని చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా నల్లమట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. స్థానికుల సమాచారం మేరకు గ్రామ చెరువులో రెండు హిటాచీ యంత్రాలు, నాలుగు టిప్పర్లతో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు నల్లమట్టిని తవ్వి తరలిస్తున్నారు. రోజుకు 50 లోడ్ల వరకు మట్టిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అక్రమ మట్టి రవాణాలో లక్ష్మీనారాయణ, శివ, రమేష్ నాయుడు అనే వ్యక్తులు ముఖ్యంగా పాల్గొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టిప్పర్లు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు రోడ్డుపై నడవాలంటే భయపడుతున్నారని చెబుతున్నారు. టిప్పర్ల రాకపోకల వల్ల ఎగిరే దుమ్ము, ధూళితో ఊరంతా కాలుష్యం నిండిపోతోంది. ఇళ్లలోకి దుమ్ము చేరడంతో ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ నల్లమట్టి అనంతపురం రూరల్ ఆలమూరు గ్రామం, టీవీ టవర్ వద్దనున్న ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు తెలిసింది.







**అధికారుల పాత్రపై అనుమానాలు :**

ఈ అక్రమ తవ్వకాలు ఇరిగేషన్ శాఖ జేఈ కృష్ణ కుమార్ కనుల ఎదుటే జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం. గనుల శాఖ నుంచి కూడా ఎలాంటి పర్మిషన్ తీసుకోలేదని తెలుస్తోంది. చెరువు మట్టిని తవ్వడం వల్ల చెరువు నిల్వ సామర్థ్యం తగ్గడంతో పాటు పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వ భూమి, నీటి వనరులను ఇలా అక్రమంగా తవ్వడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్, గనుల శాఖ అధికారులను వివరణ కోరగా సమాధానం లభించలేదు.

## బీసీల మహాధర్నాకు తరలిరండి

**• బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్ బాబు**

**• ధర్నా పోస్టర్లు ఆవిష్కరణ**



అనంతపురం, జులై 8 అనంత సూర్య : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో నిర్వహించే బీసీల మహాధర్నా కార్యక్రమానికి జిల్లాలోని బీసీలందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు వీబీ భాస్కర్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం ధర్నాకు సంబంధించి స్థానిక పాతవూరులోని విశ్వకర్మ కళ్యాణ మండపంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కర్ బాబు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు కల్పించాలని, సుప్రీంకోర్టు 50 శాతం సీలింగ్ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రద్దు చేయించాలని, రాజ్యాంగ సవరణ ద్వారా పెంచిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని షెడ్యూల్ 9లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలన్నారు. అలాగే బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని, చట్టసభల మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, బీసీ రిజర్వేషన్ల ఖరారు తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలన్న డిమాండ్‌తో ఈ మహాధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కావున ఈ ధర్నాకు పెద్ద ఎత్తున బీసీ నాయకులు, ప్రజల తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ ఆర్ నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు కేశవ్ కుమార్, విద్యార్థి టౌన్ ప్రెసిడెంట్ భరత్ యాదవ్, స్వర్ణకార సంఘం కార్యదర్శి ముష్టూర్ శ్రీనివాస్ ఆచారి, విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ నాయకులు చంద్రమౌళి ఆచారి, గురు, గౌతమ్, అశోక్, రఘు, నాగేంద్ర, కృష్ణ, శీన, ముఖేష్, సాయి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య కళాశాల ఫీజుల దోపిడీ అరికట్టాలి

**పుస్తకాల పేర్లతో రూ.వేల వ్యాపారం చేసుకున్న శ్రీ చైతన్య కళాశాలను సీజ్ చేయాలి**

**ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులకు విరుద్ధంగా వసూలు చేస్తున్న శ్రీచైతన్య కళాశాలపైన చర్యలు తీసుకోవాలి**

**విద్యార్థుల నుంచి డబ్బులు కట్టించుకొని ఇంతవరకు విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా వేధిస్తున్న కళాశాల యాజమాన్యం**

**ఏఐఎసఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ధర్నా**



అనంతపురం, జులై 8 అనంత సూర్య : అనంతపురం నగరంలో బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న నిరసిస్తూ విద్యార్థులతో కలిసి ఏఐఎసఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎసఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హనుమంతు రాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వసూలు చేయకుండా రకరకాల పేర్లు పెట్టుకుని ఎంపీసీ బైపిసి గ్రూపులలో ఐపీఎల్ నియానో సి120 మార్కెట్లో దొరికే కూరగాయల పేర్లు ఎలా అయితే రకరకాలుగా ఉంటాయో.. అలా విద్యార్థుల చదువుకు రకరకాల పేర్లు పెట్టుకొని, ఒక గ్రూపుకి ఒక్కొక్క ఫీజు నిర్ణయించి విద్యార్థుల తల్లితండ్రుల దగ్గర నుండి లక్షల రూపాయలు దండుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విచ్చలవిడిగా ఒక తరగతికి 17వేల రూపాయల నుంచి 22 వేల రూపాయల వరకు పుస్తకాల పేర్లతో వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకున్న విద్యార్థికి కట్టించుకున్న ఫీజుకి రెండవ సంవత్సరం వచ్చేసరికి 5 వేలు, 10 వేల పెంచి మిగతా కళాశాలలో కానీ, ఎవరైనా కట్టించుకుంటారు కానీ, శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం మొదటి సంవత్సరం విద్యార్థి తల్లిదండ్రులు కట్టిన ఫీజుకు డబుల్ చేసి సెకండ్ ఇయర్‌కి కట్టించుకోవడం దారుణమని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎసఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, జిల్లా ఆఫీస్ బేరర్స్ వంశీ, చందు, నాయకులు నవీన్, సాయి, సుశ్రుత్, రాకేష్, హరికృష్ణ, దిలీప్, తారక్, రిషి, భాను తదితరులు పాల్గొన్నారు.

అనంత సూర్య తెలుగువార్త

గురువారం 09 జూలై 2026

# బాధితులందరికీ న్యాయం చేస్తా

అనంతపురం, జూలై 08 అనంత సూర్య : అనంతపురం జిల్లాలో సంచలనం రేపుతున్న ఆదరణ చిట్‌ఫండ్ వ్యవహారంపై ఆ సంస్థ అధినేత రామకృష్ణ స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.



ఓ పత్రికలో ప్రచురితమైన కథనం పూర్తిగా అవాస్తవమని, ఈ వ్యవహారంతో జనసేన పార్టీకి కానీ, ఆ పార్టీ నాయకులకు కానీ ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా వ్యాపారాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, చిట్టీల వ్యాపారం, సహకార సంఘాలతో పాటు 130 ఎకరాల్లో పాలేకర్ విధానంలో సేంద్రియ వ్యవసాయం ప్రారంభించి వెయ్యి మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లామని పత్రికా విలేకరుల ముందు వివరించారు. అయితే కరోనా సమయంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో చెల్లింపులు ఆలస్యమయ్యాయని, అనంతరం నిబంధనల మార్పులు కూడా సమస్యలను మరింత పెంచాయని పేర్కొన్నారు. సంస్థకు వచ్చిన నిధులన్నీ వ్యాపారాల అభివృద్ధికే పెట్టుబడిగా పెట్టామని, సేవా కార్యక్రమాలు చేసేవారు మోసం చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. కొంతమంది దురుద్దేశంతో కార్యాలయంలో అలజడి సృష్టించారని, 15 నుంచి 20 మంది చేసిన చర్యల వల్ల సంస్థ తీవ్రంగా నష్టపోయిందని ఆరోపించారు. ఒక పోలీస్ అధికారి తన బంధువు ఉమాదేవి ఒత్తిడితో గడువు తీరకముందే తన ఆస్తిని వారి పేరిట బదలాయింపు చేయించుకుని మళ్లీ ఫిర్యాదు చేయడం వల్ల ఆస్తుల క్రయవిక్రయాలన్నీ నిలిచిపోయాయని తెలిపారు. న్యాయస్థానంలో 820 మందికి డబ్బులు చెల్లించాల్సి ఉందని అంగీకరించానని, ప్రస్తుతం 13 మంది తనను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తనపై నమోదైన రెండు ఫిర్యాదుల్లో ఒక దావా వేసిన వారే ఇప్పుడు వెనక్కి తీసుకుంటున్నారని, న్యాయస్థానాన్ని ఆశ్రయించిన వారికి ఇవ్వాల్సిన మొత్తం రూ.18 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. బాధితులందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని రామకృష్ణ హామీ ఇచ్చారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే రైతుకు మేలు

నల్లమాడ,జూలై 8,అనంత సూర్య:బీడు భూముల్లో పీఎండిఎస్ (నవధాన్యాలు) సాగు వల్ల కొంతవరకు భూమిని సంరక్షించు కుంటామని నల్లమాడ మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ సూచించారు.నల్లమాడ మండలం పేమణకుంట్లపల్లి గ్రామం లో దేవే నాయక్ రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా సీడ్ పెల్లెటై జేషన్,ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమాన్ని ఏవో,ఏపీ సీఎన్ఎఫ్ డివిజన్ ఇంచార్జ్ దామోదర్ రెడ్డి,మండల్ కోఆర్డినేటర్ రమణ, పరిశీలించారు.సీడ్ పెల్లెటైజేషన్, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ చేయడం భూమిలోని శత్రు పురుగు మిత్ర పురుగు సురక్షితంగా ఉంటాయన్నారు.వర్షాలు ప్రారంభమయ్యే ముందుగానే విత్తనాలను పెల్లెటైజేషన్ చేసి పొలంలో విత్తడం ద్వారా తొలి వర్షాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.ఈ విధానంతో విత్తనాలమొలకశాతం మెరుగు పడటంతో పాటు పంట ప్రారంభ దశలో మంచి ఎదుగు దలనమోదవుతుందని పేర్కొన్నారు.ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలం బించి తక్కువ పెట్టుబడితో అధిక దిగు బడులు సాధించాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్,డీవిజన్ ఇంచార్జ్ దామోదర్ రెడ్డి, మండల కోఆర్డినేటర్ రమణ,ఏపీసీయన్ఎఫ్ సిబ్బంది,ఇతర రైతులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఎంపిక


### నూతన అధ్యక్షులు వలిపి.ఉత్తన్న

### రాయలసీమ జిల్లాల కన్వీనర్‌గా అమర్ యాదవ్




అనంతపురం, జులై 8 అనంత సూర్య : ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర నూతన కమిటీని బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎంపిక చేశారు. నూతన అధ్యక్షులుగా వలిపి ఉత్తన్న, రాయలసీమ జిల్లాల కన్వీనర్‌గా అమర్ యాదవ్ లను ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అమర్ యాదవ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర చైర్మన్ డీవీ కృష్ణా యాదవ్ హాజరై మాట్లాడారు. భవిష్యత్ లో ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్రంలో విద్యార్థుల, యువత, నిరుద్యోగ సమస్యలపై ప్రణాలికబద్ధంగా రాజీ లేని పోరాటం చేస్తుందని తెలియజేశారు. పెండింగ్ ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పించాలని, ధరలకు అనుగుణంగా వసతి గృహాలలో మెస్ చార్జీలు పెంచాలని, ప్రైయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో తమిళనాడు తరహాలో ఫీజులు నియంత్రణ మీద సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ఉచితంగా కేటాయించిన సీట్లు విద్యారుల తల్లిదండ్రుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయకూడదని, ప్రభత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తుంపును రద్దు చేయాలని, పాఠశాలల ఫీజులు వివరాలను, టీచింగ్ సిబ్బంది వివరాలను నోటీసుల బోర్డులో వేయాలని, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు అన్నీ విభాగాలలో ఖాళీలను భర్తీ చేసి ఉద్యోగ అవకాశలను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న విశ్వావిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ప్రతి సంవత్సరం డీఎస్సీ అన్నట్లుగా నోటిఫికేషన్ ఇవ్వాలని, యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ముక్తార్ బాషా, సాయి కార్యదర్శి సతీష్, ప్రశాంత్, వెంకట్ గౌడ్, సుధాకర్ నాయక్, గంగరాజు, రాజు, సిద్దు, నరసింహులు, గోపి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

- అనుమతి లేని హాస్టల్స్‌తో రూ.కోట్లలో వసూళ్లు
- అనంత పరిధిలోనే.. 10 బ్రాంచ్‌లతో వసూళ్ల దందా !
- యదేచ్ఛగా విద్యా సామాగ్రి బహిరంగ విక్రయాలు
- విద్యార్థినీ, విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా ?
- బాలికల హాస్టల్‌లో బాలురకు వసతిపై దుమారం
- అమ్ముడుపోయారంటూ విద్యాశాఖపై విద్యార్థి సంఘాల విమర్శలు
- ఎక్కడ చూసినా.. ఆటస్థలం, మౌలిక వసతులు అంతంత మాత్రమే
- విద్యాధికారి దీర్ఘకాలిక సెలవుతో డిప్యూటీ డీఈవో అక్రమాలకు పచ్చజెండా ?




# 'ఛీ' చైతన్య విద్యాసంస్థ !

*అనంతపురం, జులై 8 అనంత సూర్య :*

వారి దృష్టిలో విద్య వ్యాపారమే. హద్దు పద్దూలేని అక్రమ వసూళ్ల దందాతో దూసుకుపోతున్నారు. కట్టడి చేయాల్సిన జిల్లా విద్యాధికారి ఇలాంటి వారి దెబ్బకి ఆరోగ్యం సాకు చూపి దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. అంతే ఇంకేముంది ఇంచార్జ్ పగ్గాలు చేపట్టిన డిప్యూటీ డీఈఓ పలు విద్యాసంస్థల అక్రమ వసూళ్లకు పచ్చ జెండా ఊపినట్లే కనపడుతుంది. ఒకే విద్యాసంస్థనే కొన్నిచోట్ల అనుమతి తీసుకుని లెక్కకు మించి పలుచోట్ల విద్యాసంస్థల బ్రాంచ్‌లను నిర్వహించడం, విద్యా హక్కు చట్టం నిబంధనలను విస్మరిస్తూ పాఠశాలల ప్రాంగణంలోనే.. పాఠ్యపుస్తకాలు, విద్యాసామాగ్రి విక్రయాలను జరుపుతోంది. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం కేటాయించిన 25 శాతం సీట్లను కూడా యదేచ్ఛగా అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటుంది. ధనమే పరమావధిగా సాగుతున్న ఓ కార్పొరేట్ విద్యా సంస్థ విషయానికి వస్తే..

### 'ఛీ' చైతన్య..

అనంత పరిధిలో ఎక్కడ చూసినా ఆ విద్యాసంస్థలే. ధనమే పరమావధిగా విద్యను వ్యాపారంగా మార్చేశారట. ఒక్క అనంత పరిధిలోనే శ్రీ చైతన్య నిర్వహిస్తున్న బ్రాంచ్‌లను ఒకసారి పరిశీలిస్తే.. దాదాపు 10 బ్రాంచులకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ బ్రాంచ్‌లు ఇవేనట కోర్టు రోడ్డు, ఆదిమూర్తి నగర్, ఆర్టీవో ఆఫీస్ సమీపంలో రెండు బ్రాంచ్‌లు, రాప్తాడు హైవేలోని సాక్షి ఎడిషన్ కార్యాలయం సమీపంలో ఓ రెండు బ్రాంచ్‌లు, రుద్రంపేట, ఆర్టీసీ బస్టాండ్, కమ్మ భవన్ సమీపంలో ఒకటి, పాములాయి సమీపంలో ఒకటి.. ఇలా చెప్పుకుంటూ పోతే, మరికొన్ని ఉన్నాయని తెలిసింది. వీటిలో కొన్నింటికి మాత్రమే అనుమతి తీసుకుని అన్నిచోట్ల నిర్వహిస్తున్నారని, మరీ ముఖ్యంగా ప్రభుత్వం నుండి హాస్టల్ అనుమతి లేదని సమాచారం. వీటితోపాటు విద్యాసంస్థల నిర్వహణ పలు చోట్ల నగరపాలక ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల్లోనూ, అక్రమ వాటర్ ట్యాప్ కనెక్షన్లను వాడుకుంటూ, తక్కువ పన్నులు చెల్లిస్తున్నారని తెలిసింది.

### బాలికల హాస్టల్‌లో బాలుర వసతిపై దుమారం :

పద్ధతి పాడు లేకుండా బాలికలకు రక్షణ కరువైయ్యేలా బాలికల వసతి గృహంలో బాలురకు వసతి కల్పిస్తుందట శ్రీ చైతన్య విద్యా సంస్థ. అదే అదే ఫోర్త్ బ్రాంచ్ గర్ల్స్ హాస్టల్లోకి సాక్షి ఆఫీస్ సమీపంలోని బ్రాంచ్ బాలురను అక్కడ హాస్టల్ నిర్మాణం సాగుతుందని ఫోర్త్ బ్రాంచ్‌లోకి.. అదేవిధంగా పాము రాయ్ బ్రాంచ్‌లోకి.. బాలురను కూడా అక్కడ హాస్టల్ సరిగ్గా లేదని ఫోర్త్ బ్రాంచ్‌లోకి కలిపేసి ఇరుకైన గదుల్లో ఇబ్బందికరంగా హాస్టల్ నిర్వహిస్తోందని విశ్వసనీయ సమాచారం. హాస్టల్‌తో కలిపి రూ.లక్ష పైమాటే అక్రమ వసూళ్లకు పాల్పడుతోందని మరో సమాచారం.


### మౌలిక వసతులు అంతంత మాత్రమే.. భద్రతా ప్రశ్నార్థకం ?

అనంతపురం జిల్లా పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలపై అంతా లోపభూయిష్టం అన్నట్టుగా విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థిని విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పన అంతంత మాత్రంగానే కల్పిస్తూ, భద్రత ప్రశ్నార్థకంగా మారిందనడానికి ఇదొక ఉదాహరణ ఓ బ్రాంచ్ నుండి ఓ విద్యార్థి తప్పిపోయి తిన్నగా ఎవరికి తెలియకుండా ఇంటికి చేరడంపై కూడా దుమారం రేగుతుంది. పాఠ్యపుస్తకాలకు సంబంధించి ముందుగానే డబ్బులు కట్టించుకుని బుక్స్ ఆర్డర్ ప్రకారం అంటూ.. నెలల తరబడి అందించకుండా కాలయాపన చేస్తున్నారని



విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపైనే పలు విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఆందోళన చేపడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఈ శ్రీచైతన్య విద్యాసంస్థలకు సంబంధించి లోప భూయిష్టంగా మారిన విద్యా లోపాలను పాఠశాలల వారీగా మరో కథనాన్ని వివరించే ప్రయత్నం చేస్తాం.



- ప్రజల మధ్య ఉండాలి.. నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలి
- ఎస్ఐఆర్, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరా
- 14లోగా నిర్దేశించిన టార్గెట్ ను పూర్తి చేయాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

## టీడీపీ నేతలతో ఎమ్మెల్యే దగ్గుపాటి

# టెలికాన్ఫరెన్స్

*అనంతపురం, జులై 8 అనంత సూర్య :*

అనంతపురం నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నేతలంతా నిత్యం ప్రజల మధ్య ఉండాలని.. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను తప్పనిసరిగా చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఉదయం ఆయన అనంతపురం అర్బన్ టీడీపీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ క్లస్టర్, కో క్లస్టర్, యూనిట్, కోయూనిట్, బూత్ ఇన్ ఛార్జిలు, రాష్ట్ర, జిల్లా, నగర కమిటీల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులతో ఈ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్‌పై బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 14వ తేదీ లోగా నిర్దేశించిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్‌లను వేగంగా సేకరించి బీఎల్ఓలకు అందజేయాలన్నారు. 2002 ఓటర్ లిస్టును పూర్తిగా వెరిఫై చేసి అర్హుల వివరాలను నిర్ధారించాలన్నారు. 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏవైనా 2కార్డులను సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. దివ్యాంగులకు సదరం స్లాట్ బుకింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో స్లాట్ బుక్ అయ్యేలా చేయాలన్నారు. ప్రతి నెల మొదటి బుధవారం యూనిట్ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష జరపాలని.. స్థానిక సమస్యలకు పరిష్కారాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. సుమారు గంటపాటు ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎస్ఐఆర్ నేపథ్యంలో ఓట్లు తొలగిస్తున్నారన్న దాంట్లో నిజం లేదన్నారు. ఇప్పటికే 18వేల ఎమ్యూనరేషన్ ఫామ్‌లు అధికారులకు అందజేశారన్నారు. 14వ తేదిలోగా దీనిని పూర్తి చేస్తామన్నారు. అర్బన్‌లో కొంత వరకు సమస్య ఉంటుందని.. ఇక్కడున్న వారికి గ్రామాల్లో కూడా ఓటు హక్కు ఉంటుందని.. అలాంటి వాటి విషయంలో అధికారులు అన్ని అంశాలను పరిశీలిస్తున్నారు. గతంలో వైసీపీ చేసిన విధంగా ఈ ప్రభుత్వం ఉండదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే అన్నీ చేస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405